# ప్రశ్న

గజిబిజిగా వుంది మనసంతా. ఈ రోజు జరిగిన సంఘటనలు తలచుకుంటే కంపరమెత్తుతోంది. పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్నాడు. ఎంతకీ తెగడం లేదు. అలా ఆరు బయట తిరిగొస్తే కాస్త మనసు కుదుటపడుతుందని లేచాడు. అలా బీచ్ వైపు వెళ్ళాడు. సముద్రపు హోరుతో కోలాహలంగా వుంది బీచ్ అంతా. ఉవ్వెత్తున లేచే కెరటాలను చూచి పిల్లలు కేరింతలు కొడుతున్నారు. పెద్దల ఉత్సాహంతో పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. కొన్ని జంటలు హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అంతా ఆనందంగా వుంది అక్కడి వాతావరణమంతా. కాని ఇవేమీ పట్టనట్టు ఒక రాతి బెంచి మీద కూర్చున్నాడు తను. మనసులో మరల ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

తను ఒక్కరే కొడుకు కావడం మూలాన బి.ఎ. పట్టా చేతికొస్తూనే తల్లిదండ్రులు పెళ్ళి చేశారు. అమ్మాయి మాత్రం ఎం.ఎ. చేసింది. పైపెచ్చుగా ఒక ఆఫీసులో ఉద్యోగం. ఇద్దరు పిల్లలు పుట్టిన వరకూ సంసారం ఎలాగో సాగిపోయింది. అప్పుడే మొదలయ్యింది అంతర్యుద్ధం. తన చిన్న వ్యాపారం పెట్టుకుని సంసారం సాగిస్తున్నాడు. ఆవిడేమో నెలకు పన్నెండు వందల రూపాయల జీతం పట్టుకొస్తుంది. ఈ చాకిరీ ఎవరుచేస్తారు అనే విసుగుతో ప్రారంభం అయింది. ఎం.ఎ. చదివి కూడా ఇంత చాకిరీ. ఆఫీసు పని ఇవన్నీ నేనే చూసుకోవాలా. ఎం.ఎ. చదివిన నేను మా వాళ్ళకి మాత్రం ఏమీ సహాయం చెయ్యకూడదా? బి.ఎ. చదివిన మీరు మాత్రం మీ బంధువులకి సహాయం చెయ్యొచ్చా? ఇదెక్కడి న్యాయం. అని చులకన చేసి మరీ చురకలు అంటిస్తోంది. అవున్లే మీ బి.ఎ. బుర్రకి ఏం అర్థం అవుతుంది లెండి విసుర్లు విసిరింది.

అప్పుడు ఆలోచించాడు తను ఎం.ఎం. చదివిన మగవారు పదవక్లాసు చదివిన అమ్మాయిని చేసుకుని సుఖపెడ్తున్నారు. కాని ఈ ఆడవాళ్ళు కొంచెం ఎక్కువ చదివితే ఎందుకు చులకనగా చూడడం? ఎక్కడుంది తారతమ్యం? ఎక్కడ నుంచి వస్తుంది సమానత్వం? వ్యాపారం కాని వ్యవసాయం కాని చేస్తే భార్యని పోషించుకోలేరా? ఉద్యోగం చేస్తేనే సుఖ పెట్టగలరా? అన్నీ శేష ప్రశ్నలే ఎక్కువగా ఆలోచిస్తే అసలు గమ్యం ఎటో తెలీకుండా పోతుంది అని లేచాడు ఇంటివైపు అడుగులు వేస్తూ.

— పి.విజయభాస్కరరెడ్డి

# ప్రాస



పోస్ట్ అన్న పిలుపు వినబడగానే ముందు గదిలో వున్న నేను వరండాలోకి వచ్చేసరికి నేలమీద పడ్డ ఉత్తరాన్ని నోట కరచుకుని పారిపోతుంది మా జానీ. జానీ అంటె మీకు తెలీదేమో? అది మా పెంపుడు కుక్క. దాని వెంటపడి నోట్లోని ఉత్తరాన్ని లాక్కున్నాను. లేకపోతే ఏదో మూల ఎవరికీ కనబడకుండా కూర్చొని ముక్కలు ముక్కలు చేసేస్తుంది. ఆ ఉత్తరం వాసు వ్రాశాడు. మా మిత్ర బృందంలోని మిగతా ముగ్గురు కూడా వస్తున్నట్టు అంతకుముందే ఉత్తరాలు వ్రాశారు. మేం ఐదుగురం ప్రతీ సంవత్సరం సంక్రాంతి శెలవులకి మా ఊళ్ళో కలుసుకోవడం ఆనవాయితీ. మా ఊరు పల్లె అనడానికీ, పట్టణం అనడానికి వీలులేదు. ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్న పెద్ద గ్రామం. శ్రీకాకుళం జిల్లాలో చివరగా, ఒరిస్సా ఒడ్డున వంశధార నదికి ఇవతలివైపు వుంది.

ఒక శుభ ముహూర్తాన మా వాసు, రాంజీ, సురేష్, మోహన్రావ్ అందరూ కట్టగట్టుకొని దిగిపోయారు. నా ఆనందానికి అవధుల్లేవు. మా మిత్ర పంచకం కలిస్తే పదివేల కోతులు కూడా సరిరావు. రోజంతా తోటల్లోనూ, వంశధారా నది ఒడ్డులోనూ గడిపేసరికి రోజులు తెలీడం లేదు. ఒక రోజు మా అత్తయ్య మా ఇంటికి వచ్చి "మీరందరూ రేపు మా ఇంటికి భోజనానికి రండి, రోజంతా మా ఇంట్లోనే వుండాలి అని చెప్పింది. మాకు అంతకంటే ఇంకేం కావాలి. మర్నాడు ఉదయం ఏడు గంటలయిందో, లేదో అందరం వాళ్ల ఇంటిముందు చేరిపోయాం. ఇంత తెల్లవారే వస్తారని అనుకోలేదని మా అత్త విస్తుపోయింది.

"మేం మాటంటే మాటే" అని అందరం కోరస్‌గా అన్నాం "ఇప్పుడు బ్రష్ కూడా మీ ఇంట్లోనే చేస్తాం" అని నేను అన్నాను. "అందరికీ బ్రష్‌లూ, పేస్టు తెప్పించు — లేకపోతే ఈ రోజు మీ ఇంట్లో వుండం" అని తెగేసి చెప్పాడు సురేష్. మా మామయ్యకు అందరం వరసైన వాళ్లమే.

# హిపోక్రసీ



డియర్ బ్రదర్!

సంవత్సరానికి ఒక్కసారి గుర్తొస్తానన్నమాట నీకు. బాగుందిరా. నాకు తెలీకడుగుతాను-సంవత్సరంలో నీకు ఒక్క రోజైనా ఖాళీ దొరకదంటావా- కనీసం ఒక్కటంటే ఒక్క ఉత్తరం 'అక్క-బావ'లకు వ్రాయడానికి? నాకు తెలిసినంతవరకు నువ్వేమంత రాచకార్యం వెలగబెడ్తున్నావనుకోను- ఉత్తరం ముక్క రాసి పడేసేంత సమయం దొరక్కపోవడానికి.

అసలు మనసులో లేనిది- కాగితాల మీద ఎలా వస్తుంది? ఆ బ్రిటిషువాడో- అమెరికావాడో చేస్తున్నాడని, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా వాడ్ని చూసి కాపీ కొట్టి మనమూ వాళ్లంత అయిపోయాం అనుకుంటే అవివేకమే అవుతుంది. వాళ్లు ఏం చేసినా నిర్భయంగా చేస్తారు. ఇష్టముంటే కలిసి వుంటారు, లేకపోతే విడిపోతారు. మనలాగా లేనిది వున్నట్టు నటించే హిపోక్రసీ వాళ్లలో చాలా తక్కువనుకుంటాను. వాళ్లలో వున్న మంచిని, డిసిప్లిన్‌ని నేర్చుకోవడం పోయి పనికిరాని ఫార్మాలిటీస్ మాత్రం అనుకరించి అఘోరిస్తున్నాం.

సంవత్సరంలో ఒక్కసారైనా అక్కా- బావల క్షేమ సమాచారాలు తెలుసుకోవాలని, ఒక్కసారి నీ ఇంటికి రమ్మని పిలవాలని, పోనీ నువ్వైనా మా ఇంటికి రావాలని అనిపించదా? ఏం మనకు రక్త సంబంధం లేదా? బంధుత్వం అంటే ఒకరి క్షేమ సమాచారాలు ఒకరు తెలుసుకుంటూ వుండడం, ఒకరింటికి ఒకరు వస్తూ పోతుండడం కాని, ఏడాదికొకసారి బజార్లో దొరికే ఓ గ్రీటింగు కార్డు కొని మొక్కుబడిగా పడేయడం కాదు.

మరెప్పుడూ న్యూ ఇయర్ గ్రీటింగ్స్ పంపించకు నాకు. డబ్బు వృథా.

—పి.లక్ష్మీశారద